సాక్షి
ములుగు
శనివారం । 16 । ఆగస్టు । 2025



సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి
టీజీ ఎన్పీడీసీఎల్‌లో సీఎండీ వరుణ్‌రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు అన్నారు. - 8లో▸



సంఘాలను పటిష్టం చేయాలి
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.2^0 / 24.3^0

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత సాధారణం. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పర్యాటక ప్రత్యేకతను చాటేలా..



ములుగు రూరల్: జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి జంగాలపల్లి క్రాస్‌లో రూ.2.16 కోట్లతో ఏర్పాటు చేసిన నంది విగ్రహం, ఢమరుకం, శిలాశాసన మండపాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు.. జిల్లాలో పర్యాటక ప్రదేశాల ప్రత్యేకతను చాటుతూ ప్రధాన కూడళ్లలో సుందరీకరణ పనులు చేపడుతూ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గట్టమ్మ వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు



ములుగు రూరల్: ఆదివాసీ నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో గట్టమ్మ ఆలయం వద్ద 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షుడు జాతీయ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుండెజబ్బుతో విద్యార్థి మృతి



నితీశ్ కుమార్ (ఫైల్)

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కమ్మరిగూడెం గ్రామంలో గుండె సంబంధిత వ్యాధితో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి మృతిచెందాడు. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోకల గంగయ్య, లక్ష్మి కుమారుడు తోకల నితీశ్‌కుమార్(6)కు పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధి ఉంది. శుక్రవారం ఉదయం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వెళ్లేందుకు తయారవుతున్న సమయంలో ఒక్కసారిగా నొప్పి వచ్చి ఇంట్లో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందాడు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మల్లూర్: కొయ్యూరు, వల్లెకుంట గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై శుక్రవారం కొయ్యూరు పోలీసులు దాడులు నిర్వహించారు. వల్లెకుంట గ్రామంలో ఇంట్లో నిల్వ ఉంచిన 20లీటర్లు, 14లీటర్లు గుడుంబాను స్వాధీనం చేసుకొని గుడుంబా తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్లు కొయ్యూరు ఎస్సై నరేశ్ తెలిపారు. రఘు, లక్ష్మికోయ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై 2 రజన్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు పెద్దపీట

జాతీయ జెండాకు అభివాదం చేస్తున్న మంత్రి సీతక్క



ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం దృష్టి

- ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క
- జంగేడు స్టేడియంలో ఘనంగా 79వ స్వాతంత్య్ర దినోత్సవం

వెంకటాపురం(ఎం)/ములుగు రూరల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నామని, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో యువతకు పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని జంగేడు స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయజెండా ఆవిష్కరించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పలు శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. స్వాతంత్య్ర సమరయోధులను శాలువాలతో సన్మానించారు. డీఆర్‌డీఏ ద్వారా 492 మహిళా సంఘాలకు 31.50కోట్లను అందించారు. పదో తరగతి, ఇంటర్ టాపర్లకు రూ.10వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. మెప్మా కింద స్వయం సహాయక సంఘాలకు రూ.17.36 కోట్లను అందించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన 20నెలల కాలంలోనే దాదాపు 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. జిల్లాలో నూతన ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణం, జిల్లాకేంద్రంలో మోడల్ బస్టాండ్, ఏటూరునాగారంలో కొత్త బస్‌డిపో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సమ్మక్క–సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ కోసం శాశ్వత భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ములుగు, బండారుపల్లి, జీవింతరావుపల్లి గ్రామాలతో ములుగు మున్సిపాలిటీగా ఏర్పాటు చేశామన్నారు. మల్లంపల్లిలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం, జిల్లాలో మరో 15 సబ్‌సెంటర్ల ఏర్పాటు కోసం చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. 2026లో జరగనున్న సమ్మక్క–సారలమ్మ మేడారం జాతరకు దాదాపు ఒక కోటి 50 లక్షల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతీ ప్రభుత్వ శాఖను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి



వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ప్రతీ పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
ప్రతి పేదకుటుంబానికి సొంత ఇంటికల నిజం చేయాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని సీతక్క చెప్పారు. జిల్లాలోని 10మండలాలు, ఒక మున్సిపాలిటీకి మొదటి దశలో 4,601 ఇండ్లు మంజూరు కాగా 3,678 ఇండ్లు గ్రౌండింగ్ కాగా, 1,561 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉండగా ఇప్పటివరకు లబ్ధిదారులకు రూ.9.81కోట్లు చెల్లించామన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం
రాష్ట్రంలోని రైతును రుణవిముక్తి చేసి, దేశంలో అత్యధిక పంట పండించే దిశగా ప్రోత్సహించామని రైతుల విషయంలో రాజీపడేది లేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. రైతుభరోసా పథకం కింద వ్యవసాయ భూములకు వానాకాలానికి గాను ఎకరానికి రూ.12 వేల చొప్పున 79,481 మంది రైతుల ఖాతాలో 99.10 కోట్లు జమ చేశామన్నారు. జిల్లాలో మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన 671 మంది రైతులకు రూ.3.81 కోట్ల రూపాయాలను రైతులకు నష్టపరిహారంగా ఇప్పించామన్నారు.

వైభవంగా మేడారం జాతర
జనవరి 28 నుంచి 31 వరకు మేడారంలో జరిగే సమ్మక్క–సారలమ్మ మహాజాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్ పథకంలో సుమారు రూ.92 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రామప్ప ఐలాండ్‌లో రూ.13కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ప్రసాద్ పథకంలో భాగంగా రూ.61 కోట్లతో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ ప్రాంతంలో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఫుడ్ కోర్టులు, సావనీర్ షాప్, ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టనున్నామన్నారు.

రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం
అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరోగ్య శ్రీ పరిధిని రూ.5 నుంచి 10 లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు శ్రీకారం చుట్టామని మంత్రి సీతక్క చెప్పారు. అటవీప్రాంతాలలో తక్షణ వైద్య సహాయం అందించేందుకు రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా నూతన ఆలోచనతో జిల్లాలో 3 తాత్కాలిక కంటైనర్ సబ్ సెంటర్లను ఏర్పాటు చేసి 4,182 మంది పేద గిరిజనులకు పరీక్షలు నిర్వహించామన్నారు. జిల్లా ఆసుపత్రిలో జనరల్ సర్జరీ విభాగంలో క్యాన్సర్ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈనెల ఇద్దరికి రొమ్ము కణితి, ఒకరికి దవడ కణితి విజయవంతంగా తొలగించి మెరుగైన వైద్యసేవలు అందించినందుకుగాను వైద్యసిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులకు ప్రశంసపత్రాలను సీతక్క అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు ఎస్పీ సదానందం, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుడిని సన్మానిస్తున్న మంత్రి సీతక్క



వేడుకల్లో దేశభక్తి గీతానికి నృత్యం చేస్తున్న చిన్నారులు

భూసమస్యలు పరిష్కరిస్తాం..
భూభారతి చట్టం ద్వారా రైతులకు చెందిన భూసమస్యలు పరిష్కరిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి 36,673 అర్జీలను స్వీకరించి, 6,284 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందన్నారు. భూములను రీసర్వే నిమిత్తం మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 5 గ్రామాలను ఎంపిక చేయగా అందులో జిల్లాలోని వెంకటాపురం మండలంలో నూగూరు రెవెన్యూ గ్రామం ఒకటన్నారు. ప్రతీ భూభాగాన్ని సర్వే చేసి రైతుల యొక్క విభాగానికి ల్యాండ్ పార్సెల్ మ్యాప్ తయారు చేసి రైతుల ఆమోదం ద్వారా రెవెన్యూ రికార్డులలో అప్‌డేట్ చేసే ప్రక్రియ మొదలైందన్నారు. ఆయిల్‌పామ్ పథకంలో భాగంగా 265 మంది రైతులకు 343.78 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగుకు పరిపాలన అనుమతులు, 72 మంది రైతులకు 88.74 హెక్టార్లలో రూ.33.35లక్షల సబ్సిడీ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభం పొందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 12 ఎకరాల్లో ఆయిల్ ఫ్యాక్టరీకోసం కేఎస్ బయోసైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి ఇచ్చి, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

ఉత్తములకు ప్రశంస
- వివరాలు 8లో▸

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకుడు జంపాల రవీందర్
- మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేత

ములుగు రూరల్ : తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మంత్రి సీతక్కకు క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 1 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ పెడతామని అన్నారు. ప్రభుత్వం మెనూ ధరను సవరించి ప్రతీ విద్యార్థికి రూ.25లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ముత్యాల రాజు, సాయలరమ, రాజకుమారి, ప్రమీల, సరోజన, లక్ష్మి, రామక్క, సవరూప, మల్లక్క రజిత, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

పవర్ లిఫ్టర్ వంశీకి మంత్రి ఆర్థిక సాయం

వాజేడు: మండల పరిధిలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన నేషనల్ పవర్ లిఫ్టర్ మొడెం వంశీకి పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్క శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. అమెరికాలో జరిగే పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనేందుకు రూ.4లక్షలు కావాల్సి ఉండగా వంశీ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి సీతక్క రూ.40 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు ఏటూరునాగారం ఐటీడీఏ నుంచి రూ.లక్ష ఇవ్వాలని పీఓకు సూచించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తొలి స్థానం సంపాదించి రాష్ట్రంతో పాటు జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. తనకు వెన్ను దన్నుగా నిలిచిన అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు, మంత్రి సీతక్కకు వంశీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు.



వంశీకి ఆర్థిక సాయం చేస్తున్న మంత్రి సీతక్క

గిరిజనులకు మంచిరోజులు

- అభివృద్ధిలో ఏటూరునాగారం ఐటీడీఏ ముందంజ
- 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: గిరిజనులకు మంచి రోజులు వచ్చాయని, స్థానికంగా మంత్రి సీతక్క ద్వారా అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రామిశ్రా కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల్లో కెల్లా ఏటూరునాగారం ఐటీడీఏ అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను పీఓ ఎగురవేశారు. ముందుగా స్కౌట్ అండ్ గైడ్స్ పీఓకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం గిరిజనుల ఉద్దేశించి పీఓ మాట్లాడుతూ.. 2026లో జరిగే మేడారం జాతర కోసం 21 శాఖలకు గాను రూ.150కోట్లతో గిరిజన సంక్షేమశాఖ ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి అందజేశామన్నారు. ఇందులో రూ.10కోట్లు గిరిజన సంక్షేమ శాఖ విభాగానికి మంజూరు కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. 2024–25లో ఎన్ఐటీ, ఐఐటీలో సీటు వచ్చిన 38 మంది గిరిజన విద్యార్థులకు రూ.15.96లక్షలను అందించామన్నారు. 28 మందికి రూ.12.45లక్షల విలువ చేసే లాప్‌ట్యాప్‌లు ఇచ్చామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఐటీడీఏ ద్వారా 8 బంజారా భవనాలు నిర్మించామన్నారు.

జిల్లాలో గిరిజనుల లబ్ధి కోసం ట్రైకార్ పథకం ద్వారా 2020–21, 2021–22గాను 889 యూనిట్లకు రూ.778.13 లక్షలు మంజూరయ్యాయన్నారు. అందులో 208 మందికి సబ్సిడీ మంజూరు కాగా అందులో 125 యూనిట్లకు రూ.కోటి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గిరి వికాసంలో 2025–26 నుంచి 2029–30 వరకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాల రైతులకు సోలార్ పంపు సెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 525 మందిని ఎంపిక చేసి వారికి సోలార్ పంపు సెట్లను ఇచ్చే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. పోడు భూములకు పట్టాలు, రైతు భరోసా వంటివి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమంగా పనిచేసిన ఉద్యోగులకు ప్రశంసపత్రాలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, జీసీసీ డీఎం వాణి, మేనేజర్ శ్రీనివాస్, ఎస్ఓ సురేశ్‌బాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, అకౌంట్స్ ఆఫీసర్ సంతోష్, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జేడీఎం కొండల్ రావు, ఆర్‌సీఓ హరిసింగ్, ఏఎంఓ వాగ్యా, ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.



జెండావిష్కరిస్తున్న పీఓ చిత్రామిశ్రా



జెండాకు వందనం చేస్తున్న పీఓ చిత్రామిశ్రా, అధికారులు



వేడుకల్లో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా



పీఓ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న ఐటీడీఏ ఏపీఓ వసంతరావు

ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలి

సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: నష్టాల్లో ఉన్న భూపాలపల్లి ఏరియాను లాభాల్లోకి తీసుకురావాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి కోరారు. 79వ స్వాతంత్య్ర వేడుకలను శుక్రవారం ఏరియాలో ఘనంగా నిర్వహించారు. ఏరియా జీఎం కార్యాలయంలో జాతీయ పతాకం ఎగురవేసిన అనంతరం సుభాష్‌కాలనీ సింగరేణి కమ్యూనిటీహాల్‌లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. సింగరేణి సెక్యూరిటీ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించి వేడుకలను జీఎం ప్రారంభించారు. ఏరియాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సింగరేణి కార్మికులకు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వేడుకలను ఉద్దేశించి జీఎం మాట్లాడారు. 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో అనేక దశల్లో నూతన సంస్కరణలు చేటుచేసుకున్నట్లు తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాం నేతృత్వంలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, కొత్త ప్రాజెక్టుల ప్రారంభం, సంక్షేమ కార్యక్రమాల అమలులో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తూ దేశంలో అనేక ప్రభుత్వ రంగ సంస్థలకు మార్గదర్శకంగా నిలుస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియా ఉత్పత్తి లక్ష్యం 72 లక్షల టన్నుల సాధించాల్సి ఉందన్నారు. ఏరియాలో గడిచిన మూడు నెలల్లో 22.5 లక్షల టన్నులు వెలికితీయాల్సి ఉండగా 21.8లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. అధిక వర్షం కారణంగా ఓపెన్‌కాస్టు 2, 3 ప్రాజెక్టుల లో అనుకున్న స్థాయిలో ఉత్పత్తిని సాధించలేకపోయినట్లు తెలిపారు. దీంతో ఇప్పటి వరకు రూ.331కోట్ల నష్టాల్లో ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, గుర్తింపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.




జెండా ఎగురవేస్తున్న జీఎం

శ్రమైక జీవన సౌందర్యం!

నేషనల్ లెవల్ ఫొటోగ్రఫీలో పాలంపేట వాసికి గోల్డ్‌మెడల్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత ఆగస్టులో ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో 186వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే కాంటెస్ట్ నిర్వహించారు. మండలంలోని పాలంపేట గ్రామానికి చెందిన తడాండ్ల శ్రావణ్‌కు మోనోక్రోమ్ విభాగంలో పల్లెటూరి జీవన విధానాన్ని చూపే ఫొటో అవార్డుకు ఎంపికైంది. ఈనెల 18న విజయవాడలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నుకసాని బాలాజీ చేతుల మీదుగా అవార్డుతో పాటు గోల్డ్‌మెడల్, నగదు పురస్కారాన్ని శ్రావణ్ అందుకోనున్నారు.

- వెంకటాపురం(ఎం)



పల్లెటూరి జీవన విధానాన్ని తెలుపుతూ శ్రావణ్ తీసిన చిత్రం

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థిని సిరి

చిట్యాల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని దైనంపల్లి సిరి తొమ్మిదో తరగతి చదువుతుంది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వేడుకల ఏర్పాట్లలో భాగంగా స్టీల్ పైప్‌తో కూడిన జెండాలను పట్టుకుని వెళ్తున్న క్రమంలో పాఠశాల ఆవరణలో విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో విద్యార్థిని సిరి చేతికి, కాలుకు గాయాలు అయ్యాయి. గమనించిన పాఠశాల సిబ్బంది హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించా రు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న బాలికను పరామర్శించారు.

ఉత్తములకు ప్రశంస


మంత్రి సీతక్క నుంచి ప్రశంసపత్రాన్ని అందుకుంటున్న ఆర్డీఓ వెంకటేశ్

ములుగు జిల్లావ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని జంగేడు స్టేడియంలో జరిగిన వేడుకల్లో మంత్రి ధనసరి సీతక్క జెండావిష్కరించి, అనంతరం ఉత్తమ అధికారులకు ప్రశంసపత్రాలు అందించారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలో జెండావిష్కరించిన పీఓ చిత్రామిశ్రా అధికారులకు ప్రశంసపత్రాలు అందజేశారు.

– సాక్షి, నెట్‌వర్క్


దేవరాజ్ డీపీఓ | సర్దార్‌సింగ్ డీసీఓ | రాంపతి సివిల్ సప్లై డీఎం | రఫిక్ డీపీఆర్‌ఓ


శ్యాంసుందర్ టీజీఎస్‌ఆర్‌టీసీ క్లర్క్ | సురేశ్‌బాబు టీజీఎస్‌ఆర్‌టీసీ సూపరింటెండెంట్ | శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్ సీసీ | రమాదేవి కలెక్టరేట్ కార్యాలయ అధికారి | దేవేందర్ ఈడీఎం | సురేశ్‌బాబు తాడ్వాయి తహసీల్దార్ | రణధీర్ జిల్లా ఇమ్యునైజేషన్ ప్రోగ్రాం అధికారి | సీతారాంనాయక్ తాడ్వాయి హెల్త్ అసిస్టెంట్ | శ్రీకాంత్ నాయుడుఎంపీఓ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ | ప్రభాకర్ కొంగాల పంచాయతీ సెక్రటరీ | అనుముల శ్రీనివాస్ ఏటూరు నాగారం సీఐ | వైద్యనాథ్ పస్రా అటవీశాఖ కంప్యూటర్ ఆపరేటర్ | రాజ్‌కుమార్ ఐటీడీఏ ఏఓ


గిరిబాబు వెంకటాపురం(ఎం) తహసీల్దార్ | రిషిత వెంకటాపురం(ఎం) ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ | విజయ్‌కుమార్ రామప్ప గైడ్ | వెంకటేష్ రామప్ప గైడ్ | వెంకటేష్ కన్నాయిగూడెం ఎస్సై | స్పందన గోవింద రావుపేట చైన్‌మెన్ | భూషన్ జూనియర్ అసిస్టెంట్ | ఆదినారాయణ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ | సారయ్య పంచాయతీ సెక్రటరీ | శ్వేత పంచాయతీ సెక్రటరీ | శ్రీనివాస్ గ్రామ పంచాయతీ సిబ్బంది | కవిత ఏఎన్‌ఎం | సమ్మక్క ఏఎన్‌ఎం


మహిళా సంఘాలకు చెక్కులను అందిస్తున్న సీతక్క


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న సీతక్క


స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థుల నృత్యాలు


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

డెంగీతో బాలిక మృతి


శాన్విక (ఫైల్)

వేలేరు: డెంగీ జర్వంతో బాలిక మృతి చెందింది. ఈ ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాలిక కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సూత్రపు రమేష్ కూతురు శాన్విక(7)కు ఐదు రోజుల క్రితం జర్వం రాగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాకు తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు డెంగీగా గుర్తించి చికిత్స చేస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దంత వైద్యశిబిరానికి స్పందన


టూత్‌పేస్ట్ అందజేస్తున్న డాక్టర్ గిరిధర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: భారత స్వాతంత్ర్య దినోత్సవం, ఎస్‌వీఎస్ దంత వైద్యశాల 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ చౌరస్తాలోని దంత ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అనూహ్య స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్ గిరిధర్‌రెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, టూత్‌పేస్టులు, మౌత్ వాష్‌లు అందజేశారు. దంతాల పరిరక్షణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. వైద్య శిబిరంలో వైద్యులు గణేష్, హారిక, సిబ్బంది యాకూబ్‌రెడ్డి, సౌమ్య, చంద్రిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


వాజేడు: కనువిందు చేస్తున్న బొగత జలపాతం

బొగత కనువిందు

వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతం శుక్రవారం ఉధృతంగా ప్రవహిస్తూ కనువిందు చేస్తోంది. దండకారణ్యంలోని కర్రె గుట్టలపై గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పైన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జలపాతానికి భారీగా వరద వస్తోంది.

విద్యార్థి ఆత్మహత్య


సాయివర్ధన్ (ఫైల్)

బచ్చన్నపేట: తండ్రి మందలించాడని మనస్థాపంతో విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి జరిగింది. కుటుంబ సభ్యులు, ఎస్సై అబ్దుల్ హమీద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేడబోయిన నర్సమ్మ–మల్లయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు సాయివర్ధన్ (20) హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. సాయివర్ధన్ సరిగా చదవడంలేదని తండ్రి మల్లయ్య మందలించాడు. దీంతో సాయివర్ధన్ క్షణికావేశంలో తమ బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి


బన్నీ (ఫైల్)

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడెం గ్రామానికి చెందిన గద్దల బన్నీ (17) తన చిన్నతనంలో తల్లిదండ్రులు మృతి చెందడంతో అమ్మమ్మ గ్రామమైన ఉప్పరగూడెంలో తాత కొమురయ్య సంరక్షణలో పెరిగాడు. పదో తరగతి పూర్తి కావడంతో ప్రస్తుతం నెల్లికుదురు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. రాఖీ పౌర్ణమితోపాటు వరుస సెలవులు రావడంతో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. శుక్రవారం తాత పొలం పనులకు వెళ్లాడు. అనంతరం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివరణ కోరగా ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వర్ధన్నపేట మార్చురీకి తరలించామని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడతామని తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదన్నారు.


పాకాల సరస్సు మత్తడి వద్ద స్థానికుల సందడి..

పాకాల మత్తడి పరవళ్లు


సరస్సు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

ఖానాపురం:వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని పాకాల సరస్సు మత్తడి పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో సరస్సులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. శుక్రవారం మత్తడి పోయడంతో ప్రజలు మత్తడి వద్ద సందడి చేశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మత్తడిని సందర్శించి పూజలు చేశారు.

సంఘాలను మరింత పటిష్టం చేయాలి

- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీందర్ రావు, డైరెక్టర్లు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మరింత పటిష్టం చేయాలని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్, వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీసీసీబీలు, టెస్కాబ్ పాలకవర్గాలకు ప్రభుత్వం ఆరు నెలలు పొడిగింపు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చిత్రపటాలకు పాలక వర్గంతో కలిసి రవీందర్ రావు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సేవ చేసేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. వరంగల్ డీసీసీబీని ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తామన్నారు. వ్యవసాయ రంగానికి సేవలు విస్తృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు హరిప్రసాద్, మాడుగుల రమేష్, దొంగల రమేష్, ఎర్రబెల్లి గోపాలరావు, మురళి, సంపెల్లి నరసింగరావు, నరేందర్ రెడ్డి, పోలపాక శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు రాజేష్ ఖన్నా, రామచంద్ర రావు, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ గౌడ్, డీసీసీబీ సీఈఓ వజీర్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికాభివృద్ధిలో కొత్త ఒరవడి

- టీజీ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ మోహన్‌రావు



మాట్లాడుతున్న వంగూరు మోహన్ రావు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి సాంకేతికంగా కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారని ప్రాజెక్టు డైరెక్టర్ వంగూరు మోహన్‌రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో మోహన్‌రావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఏపీటీఎస్–విజిలెన్స్ వారిచే గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన విద్యుత్ ఉద్యోగ అమరులకు కార్యాలయం ఆవరణలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 18 జిల్లాల్లో 70 లక్షల మంది వినియోగదారులకు 24/7 మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2024 సంవత్సరం (ఏప్రిల్ నుంచి జూలై) తో పోల్చుకుంటే 33 కేవీ బ్రేక్ డౌన్స్ 2025 (ఏప్రిల్ నుంచి జూలై) లో 21శాతం, 11 కేవీ బ్రేక్ డౌన్లు 46శాతం తగ్గాయన్నారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సీఎండీ వరుణ్ రెడ్డి స్వీయ ఆలోచనతో రూ. కోటి బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. పునరుత్పాదక శక్తి జూన్ 30, 2025 నాటికి ఎన్పీడీసీఎల్‌లో 2155.87 మెగావాట్ల సోలార్ ఎనర్జీ జనరేషన్ సామర్థ్యాన్ని సాధించామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు వంటేరు తిరుపతి రెడ్డి, మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు అశోక్ కుమార్, తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, మాధవరావు, సీజీఎంలు చరణ్ దాస్, రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరి రమేష్, కంపెనీ కార్యదర్శి వెంకటేశం, వరంగల్ ఏపీటీఎస్ సీఐ కిరణ్ పాల్గొన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- 25 కిలోల 800 గ్రాముల గంజాయి, కారు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నరసింహారావు


నిందితుల అరెస్టు చూపుతున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం: హనుమకొండ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డ్రగ్స్ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో నలుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ నరసింహారావు వెల్లడించిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం హనుమకొండ కుమార్‌పల్లిలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ దగ్గర నలుగురు వ్యక్తులు ఎండు గంజాయి కలిగి ఉన్నారని వచ్చిన సమాచారంతో నార్కొటిక్స్ సీఐ శ్రీకాంత్, ఎస్సై సీహెచ్ పరుశురాములు, సిబ్బందితో కలిసి వెళ్లి కారులో గంజాయిని తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కరీంనగర్‌కు చెందిన ఎండీ ఫైజాన్, ఎస్‌డీ అన్సార్, ఎండీ అర్బాన్, కుమార్‌పల్లికి చెందిన అర్షద్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరి నుంచి 25కిలోల 800గ్రాముల ఎండు గంజాయితోపాటు ఐదు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫైజాన్, అన్సార్, అర్బాన్.. ఆంధ్రప్రదేశ్– ఒడిశా బార్డర్ వద్ద బాలు అనే వ్యక్తి నుంచి గంజాయిని తీసుకొచ్చి హనుమకొండలోని కుమార్‌పల్లి చెందిన అర్షద్ అలీఖాన్ ఇంట్లో డంప్‌చేసి, అవసరమైన వాళ్లకి విక్రయిస్తుంటారు. ఈక్రమంలో గంజాయిని కారులో తీసుకొస్తూ పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితులను హనుమకొండ పోలీసులకు అప్పగించగా ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యాంటీ నార్కొటిక్ డ్రగ్స్ కంట్రోల్ టీం, హనుమకొండ పోలీస్‌స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.